జాతీయ తెలుగు దినపత్రిక

NIZAMABAD EDITION

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నిజామాబాద్ | మంగళవారం 28 జూలై 2026 | సంపుటి : 16 | సంచిక : 176 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఆషాఢ మాసం, గ్రీష్మ ఋతువు, దక్షిణాయణం సూర్యోదయం: 5:38 । సూర్యాస్తమయం: 6:29 చంద్రోదయం: 4:55 । చంద్రాస్తమయం: 4:16 తిథి: శుద్ధ త్రయోదశి మ. 3:40 వరకు, తదుపరి చతుర్దశి నక్షత్రం: మూల ఉ. 11:04 వరకు, తదుపరి పూర్వాషాఢ యోగం: వైధృతి రా. 12:22 వరకు, తదుపరి విష్కంభం కరణం: కౌలవ ఉ. 3:40 వరకు, తదుపరి గరజి తెల్ల. 4:37 వరకు, తదుపరి వణిజ

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# బ్యాక్ వాటర్‌లో తరచూ ప్రమాదాలు



ఏర్గట్ల
ఉత్తర తెలంగాణకు ఊపిరి పోసే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు తరచూ దుఃఖ సాగరమవుతున్నది. జీవనాడిగా పేరొందిన ఎస్సారెస్పీ ప్రమాదాలకు నిలయంగా మారుతున్నది. అధికారుల అలసత్వం, పర్యాటకుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రాణాలు నీళ్లలో కలుస్తున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుతో పాటు దిగువన గోదావరి, ఎగువన బ్యాక్ వాటర్‌లో ఎంతో మంది చనిపోతున్నా యంత్రాంగం మేల్కొనడం లేదు. భద్రతా చర్యలను పటిష్టం చేయడం లేదు. ఫలితంగా ఎస్సారెస్పీ చుట్టూ వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా నలుగురు యువకులు జల సమాధి అయ్యారు. శ్రీరాంసాగర్ పరిసర ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు పునరావృతమవుతున్నా, శాశ్వత భద్రతా ఏర్పాట్లు చేయకపోవడం ఆందోళన కలిగిస్తున్నది.

మరో మృతదేహం లభ్యం..

శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ సందర్శనకు ఆదివారం వచ్చిన నలుగురు యువకులు గల్లంతైన సంగతి తెలిసిందే. నిజామాబాద్ అటోనగర్‌కు చెందిన కలీం(24), నజువత్ (24), అజీమ్ (24), మహారాష్ట్ర బోకర్‌లోని హిమాయత్‌నగర్‌కు చెందిన ఆర్హాన్(17) వరద కాలువ సమీపంలో ప్రమాదవశాత్తు నలుగురూ నీటిలో గల్లంతయ్యారు. పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృం దాలు గాలింపు చర్యలు చేపట్టగా, ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో యువకుడు అజీమ్ ఆచూకీ లేకుండా పోయింది. సోమవారం ఉదయం నుంచి తీవ్రంగా గాలించగా అతడి మృతదేహం కూడా లభ్యమైంది. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది.

తరచూ ప్రమాదాలు..

తాగు, సాగునీటి అవసరాలు తీర్చుతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు చుట్టూ ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. జలాశయంతో పాటు చుట్టుపక్కల ఉన్న ప్రకృతి అందాలను తిలకించేందుకు సందర్శకులు భారీ సంఖ్యలో ఇక్కడకు వస్తుంటారు. ప్రాజెక్టుతో పాటు ఎగువన బ్యాక్ వాటర్ ప్రాంతం, దిగువన గోదావరి నది పరిసరాల్లో విహరిస్తుంటారు. ఈ క్రమంలో నిర్లక్ష్యం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. సెల్ఫీల కోసం పడే తాపత్రాయంలో, నీటిలో దిగాలనే ఆతృతలో కాలు జారి జల సమాధి అవుతున్నారు. ఎస్సారెస్పీ పరిసరాల్లో ఇప్పటికే చాలా మంది మృత్యువాత పడ్డారు. గతంలో అర్సపల్లికి చెందిన ముగ్గురు యువకులు గల్లంతు కాగా, దిగువన గోదావరిలోనూ చాలా మంది మృతి చెందారు. తాజాగా నలుగురు దుర్మరణం పాలయ్యారు.

# సర్కార్ ఆఫీసులో మౌలిక వసతుల కరువు

సదాశివనగర్ తహసీల్దార్ కార్యాలయంలో బాత్రూంలు, విశాలమైన గదుల కొరత

అధికారులు, సిబ్బంది, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

పక్కనే శిథిలావస్థలో పాత భవనం.. దోమలు, విషపురుగుల భయం

వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి




**కామారెడ్డి ప్రతినిధి జులై 27 ప్రజా జ్యోతి**

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం తాసిల్దార్ కార్యాలయం ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే కనీస మౌలిక వసతులు తప్పనిసరి. అయితే కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం మాత్రం మౌలిక సదుపాయాల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. బాత్రూంలు లేకపోవడం, తగిన గదులు అందుబాటులో లేకపోవడం, కార్యాలయ ప్రాంగణంలో అసౌకర్యకర పరిస్థితులు నెలకొనడం వల్ల అధికారులు, సిబ్బంది, ప్రతిరోజూ వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని అనేక గ్రామాల నుంచి ప్రజలు రేషన్ కార్డులు, కుల ధృవీకరణ పత్రాలు, ఆదాయ ధృవీకరణ - మిగతా 2లో

### ఆర్ ఎం పి పి ఎం పి వెల్ఫేర్ అసోసియేషన్ మాచారెడ్డి మండల

# అధ్యక్షుడిగా సీహెచ్. ప్రసాద్ ఏకగ్రీవ ఎన్నిక

జిల్లా అధ్యక్షుడు డా. నిజ్జన విఠల్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఏర్పాటు

సంఘ బలోపేతానికి కృషి చేస్తామని నూతన కమిటీ హామీ



**కామారెడ్డి ప్రతినిధి జూలై 27 ప్రజా జ్యోతి**

మాచారెడ్డి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఆర్ ఎం పి మరియు పి ఎం పి వెల్ఫేర్ అసోసియేషన్ మండల నూతన కార్యవర్గ ఎన్నికల సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి కామారెడ్డి జిల్లా ఆర్ ఎం పి మరియు పి ఎం పి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డా. నిజ్జన విఠల్ ముఖ్య అతిథిగా హాజరై అధ్యక్షత వహించారు. సమావేశంలో సంఘ బలోపేతం, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణ, ఆర్ ఎం పి పి ఎం పి వైద్యుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయాలంటే ప్రతి సభ్యుడు ఐక్యంగా ముందుకు సాగాలని జిల్లా అధ్యక్షుడు డా. నిజ్జన విఠల్ పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా సీహెచ్. ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బి. వెంకటేష్ ఏకగ్రీవంగా - మిగతా 2లో

# కామారెడ్డి జిల్లా ఎస్ జి ఎఫ్ పగ్గాలు ఈ. శ్రీధర్‌కు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా నియామకం

క్రీడాభివృద్ధికి కొత్త ఉత్సాహం

వ్యాయామ ఉపాధ్యాయుల హర్షం



**కామారెడ్డి, ప్రతినిధి జూలై 27 (ప్రజా జ్యోతి)**

కామారెడ్డి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) జిల్లా కార్యదర్శిగా సీనియర్ సభ్యుడు శ్రీ ఈ. శ్రీధర్ నియమితులయ్యారు. జిల్లా పాఠశాల క్రీడల నిర్వహణ, అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి పదవికి ఆయన ఎంపిక కావడం పట్ల జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 22న జరిగిన ఎన్నికల్లో ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన - మిగతా 2లో

# ఇందల్వాయి మండలంలో విద్యార్థులకు శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికల్ కిట్ల పంపిణీ




**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి) జులై 27** ఇందల్వాయి మండల కేంద్రంతో పాటు నల్లవెల్లి, సిర్నాపల్లి, ఇందల్వాయి, తిరుమన్‌పల్లి గ్రామాల్లోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల విద్యార్థులకు శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన ప్రాథమిక వైద్య సామగ్రిని అందించడం ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, విద్యతో పాటు పరిశుభ్రతను కూడా అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరేష్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, పంచాయతీ సెక్రటరీతో పాటు పలువురు గ్రామ పెద్దలు పాల్గొని ఫౌండేషన్ సేవలను అభినందించారు.

# నల్లవెల్లి గ్రామంలో కడుదురం లక్ష్మికి 5 లక్షల ఎల్ ఓ సి అందజేత:




**ఇందల్వాయి, జులై 27,( ప్రజా జ్యోతి ):** తీవ్ర కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నల్లవెల్లి గ్రామానికి చెందిన కడుదురం లక్ష్మికి మెరుగైన వైద్య సహాయం కోసం 5,00,000 (ఐదు లక్షల రూపాయల) విలువైన ఎల్ఓసీ మంజూరు పత్రాన్ని స్థానిక బీజేపీ నాయకులు అందజేశారు. బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న గ్రామ బీజేపీ నాయకులు తక్షణమే స్పందించి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే శ్రీ ధన్‌పల్ సూర్యనారాయణ గారి సహకారం మరియు జిల్లా అధ్యక్షుడు శ్రీ దినేష్ కులచారి గారి చొరవతో ఈ ఎల్ ఓ సీ లేఖను మంజూరు చేయించి అందించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ.. పేద కుటుంబానికి అండగా నిలిచి ఐదు లక్షల రూపాయల సహాయం అందింపజేసిన ఎమ్మెల్యే ధన్‌పల్ సూర్యనారాయణ గారికి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కన్నె రాజేందర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు నోముల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శ్రీకాంత్, రాజేందర్, జనార్ధన్, మల్లేశ్, దిలీప్, చింతలపల్లి రమేష్ రెడ్డి, గురుమూర్తితో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్యాసంపల్లి తండా గ్రామంలో వైద్య ఆరోగ్య శిబిరం

**మలేరియా, డెంగ్యూ, క్షయ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి**

**ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ**



**కామారెడ్డి ప్రతినిధి, జూలై 27(ప్రజాజ్యోతి):** కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి తండా గ్రామంలో సోమవారం దేవునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు మలేరియా, డెంగ్యూ, క్షయ (టీబీ) వంటి అంటువ్యాధులను ముందస్తుగా గుర్తించి నివారించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్‌సీవీబీడీసీపీ--టీబీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మీనాక్షి దేవి మాట్లాడుతూ, గ్రామాల్లో అంటువ్యాధుల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. జ్వరం, దగ్గు, శ్వాస సంబంధిత సమస్యలు, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నియంత్రించడం సాధ్యమవుతుందని తెలిపారు. శిబిరంలో వైద్యులు గ్రామ ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. రక్తపోటు, మధుమేహం, జ్వరం, క్షయ వ్యాధి అనుమానితులు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు అందించారు. అనంతరం గ్రామ ప్రజలకు మలేరియా, డెంగ్యూ, టీబీ నివారణపై విస్తృత అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నిల్వ నీరు లేకుండా చూడడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం ద్వారా అంటువ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని వైద్య సిబ్బంది వివరించారు. గ్రామ సర్పంచ్ భూక్య శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాజేశ్వరి, బాలరాజువ్వ, గ్రామ సెక్రటరీ నాగరాణి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపసర్పంచ్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఉత్సాహంగా హాజరై ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు.

# కాలేజీ విద్యార్థులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని బస్ డిపో డీఎంకు వినతి



**కామారెడ్డి ప్రతినిధి జూలై 27 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన కాలేజీ విద్యార్థులు ప్రతిరోజూ విద్యాభ్యాసం కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులపై ఆధారపడుతున్నారు. అయితే ప్రస్తుతం నడుస్తున్న బస్సులు పూర్తిగా ప్రయాణికులతో నిండిపోవడం వల్ల విద్యార్థులు బస్సు ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా వారు సమయానికి కాలేజీలకు చేరుకోలేక విద్యాభ్యాసానికి అంతరాయం కలుగుతోంది. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈరోజు బస్ డిపో డీఎం గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని కాలేజీ సమయాల్లో చిన్న మల్లారెడ్డి గ్రామ విద్యార్థులకు అనుకూలంగా ప్రత్యేక బస్సు లేదా అదనపు ట్రిప్‌ను ఏర్పాటు చేయాలని, ఉదయం మరియు సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యాన్ని మెరుగుపరచాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థులు సమయానికి విద్యాసంస్థలకు చేరుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రవాణా సమస్య కారణంగా వారి చదువుకు ఆటంకం కలగడం బాధాకరమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బస్ డిపో డీఎం సమస్యను సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి రాజా గౌడ్ , సర్పంచ్ బీమాయల లక్ష్మీరాజు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ కమ్మరి సిద్ధరాములు , ఉప సర్పంచ్ శ్రీమతి కమ్మరి స్వప్న లక్ష్మీనారాయణ , వార్డు సభ్యురాలు శ్రీమతి భార్గవి ప్రశాంత్ మమత గ్రామ పెద్దలు బత్తుల కిషన్ , అలాగే పెద్ద సంఖ్యలో కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు

# భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించిన సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ

**కలాం ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి:**

**రాష్ట్ర సలహాదారు కేతు రమణారెడ్డి**

**కామారెడ్డి, ప్రతినిధి జూలై 27:** ప్రజా జ్యోతి భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామంలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన దేశానికి చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర సలహాదారు కేతు రమణారెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం భారతదేశ అభివృద్ధికి, విజ్ఞాన శాస్త్ర రంగానికి, రక్షణ వ్యవస్థ బలోపేతానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశాన్ని ప్రపంచ వేదికపై గర్వంగా నిలబెట్టిన గొప్ప శాస్త్రవేత్తగా, ప్రజల రాష్ట్రపతిగా కలాం ప్రతి భారతీయుడి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. యువత పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని కలాం ఇచ్చిన సందేశం నేటికీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్య, క్రమశిక్షణ, కృషి, దేశభక్తి అనే విలువలను జీవితంలో ఆచరిస్తూ, ప్రతి భారత పౌరుడు కలాం గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ. సలీం మాట్లాడుతూ, డాక్టర్ కలాం జీవితం నిరాడంబరతకు, నిజాయితీకి, సేవాభావానికి ప్రతీక అని అన్నారు. ఉన్నత పదవిలో ఉన్నప్పటికీ సాధారణ ప్రజలతో మమేకమై జీవించిన మహనీయుడిగా ఆయనను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. సమాజంలో యువత శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు డాక్టర్ కలాం జీవితం ప్రతి విద్యార్థికి, ప్రతి యువకుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన రచనలు, ఆలోచనలు, దేశాభివృద్ధిపై ఉన్న దూరదృష్టిని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేసి ఆచరణలో పెట్టాలని సూచించారు. అనంతరం కలాం గారి చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ. సలీం, జిల్లా వక్త న్యాయవాది ఈక శ్రీనివాసరావు, జిల్లా మహిళా కార్యదర్శి యు. భాగ్యలక్ష్మి, జిల్లా సలహాదారు అబుల్ రెడ్డి, జిల్లా ప్రతినిధులు శ్రీనివాస్ గుప్తా, శ్రీకాంత్, కాసర్ల లింగం, చాకలి లింగం, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం చివర్లో భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరిస్తూ, దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

# ఆర్ఎంపిపిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ మాచారెడ్డి మండల అధ్యక్షుడిగా సీహెచ్. ప్రసాద్ ఏకగ్రీవ ఎన్నిక

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు డా. నిజ్జన విఠల్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు సీహెచ్. ప్రసాద్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి, మండల సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, వైద్య సేవల నాణ్యత పెంపు కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి సభ్యుడిని కలుపుకొని సంఘాన్ని మరింత బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.
ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బి. వెంకటేష్ మాట్లాడుతూ, సంఘం నిర్ణయాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ సభ్యులందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. మండలంలోని ప్రతి ఆర్ ఎం పి పి ఎం పి వైద్యుడిని సంఘంలో భాగస్వామిని చేసి సంఘాన్ని మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని అన్నారు. జిల్లా అధ్యక్షుడు డా. నిజ్జన విఠల్ మాట్లాడుతూ, సంఘ అభివృద్ధిలో కొత్త కార్యవర్గం కీలక పాత్ర పోషించాలని, సభ్యుల సమస్యలను జిల్లా కమిటీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో , ఆర్.ఎం.పి
పి ఎం పి వైద్యుల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీహెచ్. బుచ్చిరెడ్డి, అంజిరెడ్డి, జే. గంగాధర్, మాణిక్యం, షేక్ అజీజ్, గోపాల్‌రావు, నారాయణ, హరిశంకర్, విజయ్ గౌడ్, కాళిదాసు, సంతోష్, వెంకటేష్, గంగారం, సంగయ్య తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. సభ ముగింపులో నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిని సభ్యులు ఘనంగా శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గం నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి చెందాలని సభ్యులు ఆకాంక్షించారు.

# ఇందల్వాయిలో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



**ఇందల్వాయి(: ప్రజా జ్యోతి ) జూలై. 27** ఇందల్వాయి మండల తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతున్న నేపథ్యంలో శాశ్వత కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సోమవారం మండల తహసీల్దార్ బాలయ్య ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం కార్యాలయ భవన నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా స్థలాన్ని పరిశీలించి, అక్కడ నిర్మాణానికి అవసరమైన అంశాలను పరిశీలించారు. త్వరలోనే భవన నిర్మాణానికి సంబంధించిన తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిపై జనరల్ బాడీ సమావేశం



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) జూలై. 27** ఇందల్వాయి మండల కేంద్రంలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం సర్పంచ్ సంగీత దిలీప్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సభ్యులు చర్చించారు. గ్రామంలో దోమల బెడద ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వెంటనే ఫాగింగ్ నిర్వహించి దోమల నివారణ మందులు పిచికారీ చేయాలని నిర్ణయించారు. అలాగే గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, మురుగు నీటి పారుదల కోసం మురికి కాలువల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సమావేశంలో సూచించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్యాలయ నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన నేపథ్యంలో ఆ నిర్మాణాన్ని త్వరితగతిన పునఃప్రారంభించి పూర్తి చేయించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసి చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. గ్రామ అభివృద్ధి పనులను ప్రజల సహకారంతో సమర్థవంతంగా అమలు చేయాలని సర్పంచ్ సంగీత దిలీప్ పిలుపునిచ్చారు. సమావేశంలో వార్డు సభ్యులు, రాథోడ్ మమత జి గణేష్. జి సుధారాణి. జి బాబులాల్. జరుపుల బుజ్జి. పంచాయతీ సెక్రటరీ సుధాకర్. కారోబార్ శీను గ్రామ పెద్దలు, అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# విత్తన మేళా రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) జులై. 27** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సు వానాకాలం సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం లేదా తక్కువ వర్షపాతం ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు నీటి అవసరం తక్కువగా ఉండే వర్షాధార పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ సూచించారు. ఈ సందర్భంగా ఇందల్వాయి రైతు వేదికలో విత్తన మేళా నిర్వహించగా, ఇందులో కందులు (రెడ్‌గ్రామ్) వివిధ కూరగాయల విత్తనాలను ప్రదర్శించారు. రైతులకు అందుబాటులో ఉన్న నాణ్యమైన విత్తనాల గురించి వివరించి, తక్కువ వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కందులు, సజ్జలు, మొక్కజొన్న వంటి వర్షాధార పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని సూచించారు. అలాగే రైతులు ధృవీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి, బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని, విత్తనాల ప్యాకెట్‌పై ఉన్న వివరాలను పరిశీలించి కొనుగోలు చేయాలని అవగాహన కల్పించారు. కూరగాయల సాగు ద్వారా కుటుంబ పోషకాహార భద్రతతో పాటు అదనపు ఆదాయం కూడా పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, విత్తనాల విక్రేతలు పలువురు రైతులు పాల్గొని విత్తన ప్రదర్శనను పరిశీలించారు. రైతులు విత్తన మేళాను సద్వినియోగం చేసుకొని తమ ప్రాంత పరిస్థితులకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.

